# అభివందనం

వెలమకన్ని మధుమతి

**ఆ**ఫీసుకొచ్చి కూర్చుని రేడియో టాక్‌కి స్క్రిప్ట్ తిరగేస్తుంటే గుర్తొచ్చింది, నన్ను కలవడానికి ఎవరో వస్తారని మా వారు చెప్పిన విషయం. ఇంతలోనే అటెండర్ ఎవర్నో వెంట పెట్టుకొచ్చి ''రమ్మంటారా మాడమ్?'' అని అడిగాడు.



''లోపలికి రమ్మను.'' నా ఎదురుగా ఉన్న కుర్చీలను చూపిస్తూ అన్నాను. స్క్రిప్ట్ పేపర్లు బాగ్‌లో సర్ది తలెత్తగానే ఎదురుగా కూర్చున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను.

''ఔను. మురళి! తను పొరబడడం లేదు... దాదాపు ఇరవై ఏళ్ళ తరువాత....

అతని ముఖంలో కూడా ఆశ్చర్యం కనిపించింది. కొంచెం లావయ్యాడు. చెంపలు, మీసాలు కొద్దిగా నెరిసాయి.

''బాగున్నారా'' అని పలకరించబోయి తమాయించుకున్నాను. బావుంటే తన దగ్గరెందుకొస్తారు? అయినా కౌన్సిలింగ్ అయ్యేవరకూ గుర్తు పట్టనట్లే ఉండాలి. మరి అతనెందుకు నన్ను పలకరించలేదు? నాకు బాగానే ఒళ్ళొచ్చింది. జడ ముడిగా మారింది. కొద్దిగా పండిన జుట్టుతో కొంచెం వయసుకి మించే కనపడతాను. నన్ను గుర్తుపట్టి ఉండడు. కానీ అతని ముఖంలోని ఆశ్చర్యం నన్ను ఠక్కున గుర్తించాడనే చెప్తోంది. బహుశా నన్ను ఈ పరిస్థితులలో కలవడం ఇబ్బందిగా ఉండవచ్చు. ఎన్నో జంటలని కలిపిన వనితగా నా పేరు పేపర్లో చదివినా తనకు తెలిసిన వసుంధర అని అనుకొని ఉండకపోవచ్చు.

ఆ నిముషంలో నాలో కలిగిన ఉద్వేగం, అలజడి అన్నీ పక్కన పెట్టి, సర్దుకుని ''చెప్పండి! నాకు రావుగారు విషయం అంతా చెప్పారు. నేను కేస్ స్టడీ చేసేంతలో మీరీ ప్రశ్నావళి నింపండి..'' అని రెండు మూడు పేపర్లు పిన్ చేసి అతనికిచ్చి పక్క గదిలోకి పంపాను. వాళ్ళ కేసుకి సంబంధించిన కాగితాలున్న ఫైలులో తల దూర్చాను. అందులోని విషయం టూకీగా మా వారు ఇంతకు ముందే చెప్పారు. అక్షరాల మీద నుండి నాకు తెలియకుండానే నా మనసు గతంలోకి వెళ్ళిపోయింది.

***

మురళి, అన్నయ్యకి స్నేహితుడు. తరుచూ మా ఇంటికొచ్చేవాడే. తెలివిగల వాడు. మితభాషి. ఒకరి ఇష్టాయిష్టాలను ఇంకొకరు గౌరవించడం, అనవసర విషయాల్లో జోక్యం చేసుకోకపోవడం లాంటి గుణాలున్న మా యింటి వాతావరణం అతనికి బాగా నచ్చేదనుకుంటా. నాన్నగారు చాలా పుస్తకాలు సేకరించి, తను చదివి మా చేత చదివించేవారు. నాకూ అన్నయ్యకూ అదే అలవాటైంది. చదివిన ప్రతి పుస్తకాన్నీ ఇద్దరం చర్చించుకునేవాళ్ళం. నిజానికి ఇద్దరి అభిప్రాయాలూ ఒకటే అయినా అన్నయ్య నాకు పూర్తి వ్యతిరేకంగా వాదన మొదలెట్టేవాడే. ఎటు తిరిగీ సంభాషణ స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం దగ్గరకొచ్చేది. నా పుస్తక పరిజ్ఞానాన్నంతా మాటల్లో పెట్టేసేదాన్ని. తమ్ముడు కూడా అన్నయ్యతో కలిసి ఉడికించేవాడు. మురళి కూడా వాళ్ళతో కలిసేవాడు. కాఫీ టిఫిన్లు అందిస్తూ వదిన మాత్రం మధ్యమధ్యలో నాకు వత్తాసు పలికేది. ఒక్కొక్కసారి చర్చ చాలా వేడిగా ఉండేది. అంత వేడిలో కూడా అలగడం, కోపంగా లేచి వెళ్ళడం లాంటివి జరిగేవి కావు. అన్నయ్య మాటల్తో మళ్ళీ వాతావరణం మామూలుగా అయిపోయేది.

ఈ అనుభవంలో అప్పటికే నేను చిన్నపాటి రచనలు చేసేదాన్ని. కాలేజీలో మంచి వక్తగా కూడా పేరుండేది. కొన్ని రచనలు అచ్చులో చూసుకునే భాగ్యం కూడా కలిగింది.

***

ఒక రోజు కాలేజి నుండి ముందుగా వచ్చిన నాకు అమ్మ, అన్నయ్యల సంభాషణ వినపడింది.''మురళికి సంబంధాలు వస్తున్నాయిటమ్మా. వాడికి మన వసుని చేసుకోవాలనుంది. దాని అభిప్రాయం కూడా కనుక్కోమన్నాడు. ఇంకొక అయిదారు నెలల్లో ఉద్యోగం స్థిరమవగానే చేసుకుంటాట్ట.''

''చాలా సంతోషంరా. వసు చిన్న పిల్ల. దాని అభిప్రాయం మనకు తెలియదా? అయినా, మురళి మనకు చిన్నప్పటి నుండీ తెలిసినవాడు. ఇంత కంటే మంచి సంబంధం ఏముంటుంది?''

''అవుననుకో....''

''అయినా ఇంకొక ఆర్నెల్లు టైముందంటున్నావుగా, ఈ లోపల వసు పరీక్షలు కూడా అయిపోతాయి. అప్పుడే చెబ్దాం.''

''అలాగే.. వసు పెళ్ళి బాధ్యత ఇంత తేలిగ్గా అయిపోతుందనుకోలేదమ్మా. వాడికి ఓకే అని చెప్పేస్తాను మరి.'' అనేసి అన్నయ్య బయటికి రాగానే నేను కనపడ్డాను.

''అంతా వినే ఉంటావ్‌గా! ఏమంటావైతే?!'' నవ్వుతూ అడిగాడు.

''నువ్వేలా అంటే అలా'' అని నేనూ నవ్వుతూ లోపలికెళ్ళిపోయాను.

ఆ రోజుటి నుండి మురళి నాకు వేరుగా కన్పించడం మొదలైంది. అతని మూర్తి నా కాబోయే భర్తగా నా గుండెల్లో ముద్ర పడిపోయింది. అలాగని ఎప్పుడూ మేము ఒంటరిగా ప్రేమ కబుర్లు చెప్పుకోలేదు. నేను సిగ్గుతో మెలికలూ తిరగలేదు. చాలా మామూలుగా ఉండేదాన్ని. చిత్రంగా దాని వలన నా చదువుకు కూడా ఎటువంటి అంతరాయం కలగలేదు. ఉట్టి ప్రేమకథలే కాక మంచి సాహిత్యాన్ని చదవడం వలన కాబోలు ఆ వయసులో ఉండాల్సిన కలల ప్రపంచం కంటే వాస్తవానికే దగ్గరగా ఉండగలిగాను.


***

ఆడవాళ్ళకి ఉద్యోగం అవసరమా, కాదా అని ఒకరోజు చర్చ. వాళ్ళావిడ ఉద్యోగం చెయ్యట్లేదు కనుక స్త్రీకి ఉద్యోగం అనవసరం అని అన్నయ్య మొదలెట్టాడు. మురళీ అదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు. నాకు వెంటనే ఉడుకుమోత్తనం వచ్చేసింది.

''ఏం! ఎందుకు చెయ్యకూడదూ? ఆర్థిక స్వాతంత్ర్యం ఉండడం ఎప్పుడూ మంచిదే. కొన్ని ఆశయాలను ఆచరణలో పెట్టాలంటే ఆర్థిక బలం కూడా కావాలి. బావిలో కప్పల్లా ఉండకుండా బయటి ప్రపంచం తెలుసుకునే అవకాశం కూడా వస్తుంది.'' అని నొక్కి చెప్పాను.

''నిజంగా ఇదే నీ అభిప్రాయమా?'' మురళి కొంచెం ముందుకి వంగి కుతూహలంగా అడిగాడు.

''అవునూ! ఎందుకలా అడుగుతున్నారు? నా అభిప్రాయాన్నే నేను చెప్తున్నాను. అన్నయ్యే ఔనంటే కాదని వాదిస్తుంటాడు.'' అన్నయ్య వంక






నవ్వుతూ చూస్తూ చాలా మామూలుగా అన్నాను. మురళి మాత్రం ముభావంగా ఉండిపోయాడు.

***

తరువాత నా పరీక్షల హడావుడితో నేనుండిపోయాను. అన్నయ్య ఆఫీసు పనుల్లో బిజీగా ఉన్నాడు. మురళి కూడా రావడం తగ్గించాడు. పరీక్షలైపోయి గ్రాడ్యుయేట్‌ననిపించుకున్నాను. వేసవిలో ముహూర్తాలు పెట్టించాలని, మురళి పెద్దలతో మాట్లాడాలని అన్నయ్య అనుకుంటున్న సమయంలో, అతను వేరే సంబంధం చూసుకున్నాడని విని ఇంట్లో అందరికీ షాక్. నేను వెంటనే తేరుకోలేకపోయాను. అతనెందుకలా చేశాడు? నేను అందంగా ఉండకపోయినా అనాకార్ని కాదు. యవ్వనపు ఆకర్షణ నాలో ఉంది. వాళ్ళింట్లో వాళ్ళకి నేను నచ్చలేదా? కారణం తెలుసుకోవాలని కుతూహలం ఎక్కువైంది. అయినా అన్నయ్యని కానీ, అమ్మని కానీ అడగలేదు. అన్నయ్యకి తప్పకుండా తెలిసే ఉంటుంది. కానీ తనూ నాకు చెప్పలేదు. పైగా నాకు సంబంధాలు వెతకడం మొదలెట్టాడు. నేనెంత బాధపడుతున్నానో అన్నయ్య అంతకు రెట్టింపు బాధ పడుతున్నాడని నాకు తెలుసు. అందుకే నా బాధని నాలోనే మింగేసి 'నాకు ఇంకా చదవాలనుంది. ఇప్పుడే పెళ్ళొద్దని' సున్నితంగా తిరస్కరించాను.

ఎమ్మే సైకాలజీ చేశాను. వెంటనే వేరే స్టేట్‌లో పిహెచ్‌డి చెయ్యడానికి వెళ్తుంటే అన్నయ్య బాధపడ్డాడు.

''వసూ! తప్పంతా నాదేనే. నీలోని రచయిత్రిని, మంచి వక్తని బయటికి తేవాలని నిన్ను ప్రేరేపించే వాణ్ణి. కానీ అదే మురళితో నీ పెళ్ళి ఆగిపోడానికి కారణం అవుతుందనుకోలేదు.''

అర్థం కానట్లు చూశాను అన్నయ్య వంక.

''ఒక రోజు మురళి వచ్చి తను వేరే సంబంధం ఖాయం చేసుకున్నానని, వసుంధరని చేసుకోనందుకు ఏమీ అనుకోవద్దని అన్నాడు. కారణం చెప్పమని నిలదీస్తే, 'మీ వసు మంచి రచయిత్రి కాగలదు కానీ, మంచి గృహిణి మాత్రం కాలేదు. నా భార్య ఉద్యోగం చెయ్యడం నాకిష్టంలేదు. కానీ తను అలా ఊర్కోదు. నేను చాలా మామూలు వాణ్ణి. నిత్యం అభిప్రాయ భేదాలతో కీచులాడుకుంటూ, హక్కుల కోసం పోరాడుకుంటూ జీవితాన్ని పాడుచేసుకోలేను' అన్నాడు. నీ మనసు తెలుసుకోలేని మూర్ఖుడు వాడు. నువ్వొక 'పురుష ద్వేషి' వని అపోహపడ్డాడు.'' అన్నయ్య ఆవేశంగా అన్నాడు.

ఇన్నిరోజులూ కారణం ఏమై ఉంటుందా అని మథనపడిన నాకు అన్నయ్య చెప్పింది వినగానే ఫక్కున నవ్వాలనిపించింది. ఒకరకంగా మనసు తేలికైంది.

''పోనీలే అన్నయ్యా! పెళ్ళయ్యాక అభిప్రాయ భేదాలతో విడిపోయే కంటే ఇదే మంచిదిగా...''

ఎందుకో అతని మీద కోపం రాలేదు.

''అందరు మగాళ్ళూ అలాగే ఉంటారనుకుని నువ్వు పెళ్ళి వద్దనడం మాకు బాధగా ఉంది. నీ అభిప్రాయం మార్చుకుని త్వరలో పెళ్ళికి ఒప్పుకుంటావని ఆశిస్తున్నాను.'' ముగింపుగా చెప్పాడు.

'సరే'నని తలూపాను.

మురళి అంత సంకుచితంగా ఎలా ఆలోచించాడు? నిజానికి పురుష ద్వేషానికి కేవలం పుస్తక పరిజ్ఞానమే తప్ప తనకేం అనుభవం ఉందని? తెలిసీ తెలియని వయసులో తను మాట్లాడిన దాన్ని అతను ఎంత సీరియస్‌గా తీసుకున్నాడు! నాకు పెళ్ళి, సంసారం సరిపడవేమో అనే భావన నాలో మెల్లగా వచ్చేసింది. తెలియకుండానే నాలో స్వతంత్ర భావాలు చోటు చేసుకోవడం మొదలెట్టాయి. రీసెర్చి, ఆ తరువాత ఉద్యోగం అంటూ దాదాపు పదేళ్ళు ఇంటికి దూరంగా ఉన్నాను.

***

'అమ్మకి సుస్తీగా వుంది నిన్ను చూడాలంటోంది' అని అన్నయ్య ఉత్తరం రాస్తే లీవ్ పెట్టి వెళ్ళాను. నేను పెళ్ళి చేసుకుని జీవితంలో స్థిరపడలేదని అమ్మ బాధంతా. అన్నయ్య లోపల కుమిలిపోతున్నాడు. అది చూశాక నాకనిపించింది.'నా ఈ మంకు పట్టు దేనికి? నా జీవితం ఎటు పోతుంది?' అని. నేను పెళ్ళికి సుముఖంగా ఉన్నానని చెప్పిన వెంటనే వదిన దూరపు బంధువు రావుగారితో నా వివాహం జరిగిపోయింది. రావుగారు వృత్తి రీత్యా లాయరు. అయిదుగురు అక్క చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేశాకే తను చేసుకున్నారు. గలగలా మాట్లాడుతూ, సరదాగా ఉంటారు.

ఉద్యోగం వదిలేశాను. నా దిన చర్యంతా మారిపోయింది. ఆయన సాంగత్యంలో వివాహబంధంలోని మాధుర్యాన్ని చవిచూశాను. అన్నయ్యకోసం ఎంత రాత్రయినా భోజనం చెయ్యకుండా కూర్చునే వదిననీ, ఆఫీస్‌కెళ్ళే వరకూ అన్నీ అంది పుచ్చుకుంటూ వదినని తన చుట్టూ తిప్పుకునే అన్నయ్యనీ చూస్తుంటే నాక్కోపం వచ్చేది. వదినే కాదు ఏ భార్య అయినా అలా ఎందుకు చేస్తుందో నాకిప్పుడు అర్థం అయింది. ప్రేమ ఉన్న చోట పంతం, పోటీ ఉండదు. నేనన్న మాటలకి వదిన ఎంత నవ్వుకునేదో తలుచుకుంటే సిగ్గేస్తుంది. ఇద్దరు పిల్లలు, వాళ్ళ ఆలనా పాలనతో కాలం గిర్రున తిరిగిపోయింది. పిల్లలు కొంచెం పెద్దవాళ్ళై తీరిక దొరుకుతున్న సమయంలో ''నువ్వేదో రచయిత్రివనీ, చెప్పదల్చుకున్న విషయాన్ని చాలా చక్కగా చెప్తావనీ మీ అన్నయ్య చెప్పాడు... మరి నువ్వు అలాంటిదేమీ చేస్తున్నట్లులేదే...'' అన్న రావుగారి మాటలకి నిరుత్సాహంగా నవ్వాను.

''నా రచనల వలన ఉపయోగం ఏముంది? ఏదో కాలక్షేపానికి రాసుకునేవే.''

''అలా ఎందుకనుకుంటావ్? నీ రచనలు ఆలోచింపచేస్తాయి. పాఠకులను తప్పకుండా ప్రభావితం చేస్తాయి. పైగా సైకాలజీ ప్రొఫెసరువి. నా వృత్తిలో కూడా సాయపడగలవు.'' ఆయన ప్రోత్సాహంతో మళ్ళీ సాహిత్యసేవ మొదలైంది. 'మ్యారేజ్ అండ్ ఫామిలీ కౌన్సిలింగ్' మొదలెట్టాను. మావారి దగ్గరకొచ్చే విడాకుల కేసులని నా దగ్గరకు పంపుతారు. నాదగ్గరకొచ్చే జంటల్లో ఎక్కువ మంది పెళ్ళయిన రెండు మూడేళ్ళలో విడిపోవాలనుకునేవారే. భార్యా భర్తలిద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉండి, చిన్న వయసులోనే అన్నీ అనుభవించేసి, దేనినీ, ఎవరినీ

లెఖ్ఖ చేయనితనం వచ్చేస్తోంది. ఇద్దర్నీ కట్టి పడేసే ప్రేమ కంటే విడదీసే ఇండివిడ్యుయాలిటీ ఎక్కువైపోతోంది. వారి తల్లిదండ్రుల పాత్ర కూడా ఇందులో చాలా ఉంది. అందుకే నేను వాళ్ళని కూడా విచారిస్తాను. ఆనందమయ కాపురానికి నేను చెప్పే సలహాలు, చిట్కాలూ పనిచేయడంతో నాకూ వృత్తిలో ఎంతో సంతృప్తి లభిస్తోంది.

మురళి భార్య పెళ్ళయిన పన్నెండేళ్ళకి విడాకులడుగు తోంది. తనని మనిషిలా కాక మరమనిషిలా చూస్తాడనీ, అది నా ఇల్లు అనే భావన నాకు కలగనీయలేదనీ, చివరికి కన్నపిల్లల విషయంలో కూడా తనదొక ఆయా పాత్ర మాత్రమేననీ ఆమె అభియోగాలు. ముందుగా ఆమె భర్త సమాధానాలు వినమనే రావుగారు అతన్ని ఈ రోజు నా దగ్గరకు పంపారు. కానీ అతను నాకు తెలిసిన మురళి అన గానే నాకు ఏం చెయ్యాలో పాలు పోవడం లేదు.

***

''కాఫీ తెమ్మంటారా మాడమ్?'' అన్న అటెండర్ మాటకి గతంలో నుండి బయటకొచ్చాను.

''ఊఁ! రెండు పట్రా. ఇందాకొచ్చిన సార్ లోపల ఉన్నారు. పిలు.''


''ఆ సార్ ఇందాకే వెళ్ళిపోయారమ్మా. ఇది మీకు ఇచ్చే యమన్నారు.''

'' అయితే నేనిచ్చిన కాగితాలు యధాతథం వెనక్కిచ్చి వెళ్ళిపోయాడన్నమాట మురళి.'' అటెండర్ చేతినుండి అందుకుంటుంటే అందులో నుండి చిన్న పేపరు మడత నాముందు పడింది.

'భార్యకు విడాకులిచ్చి జీవితంలో రెండో తప్పు చెయ్యదల్చుకోలేదు. థాంక్యూ- మురళి.'

నిశ్చింతగా కళ్ళు మూసుకుని కుర్చీలో వెనక్కివాలాను.

★



## హ్యాపీ లైఫ్

ఇద్దరు సినిమా తారలు పాతికేళ్ళు వైవాహిక బంధంలో గడపడం చిన్నవిషయం కాదు. కాదు. పెళ్ళిళ్ళు విఫలమవుతున్నవారి సంగతి పక్కనపెడితే ఎలాంటి కలతలూ లేకుండా రిషికపూర్‌తో జీవితం పంచుకుంది నీతూసింగ్. ముంబై పాలిహిల్స్‌లో అతి విశాలమైన బంగళాలో వాళ్ళు హాయిగా ఈరోజుకీ నవ్వుతూ తుళ్ళుతూ వున్నారు. ఆమెకి ఇద్దరు పిల్లలు. రిదిమా, రన్‌బీర్. ఇద్దరూ కూడా సినిమా రంగంలో కాలుపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. నీతూ సింగ్ బంగళాపేరు కృష్ణరాజ్. తల్లిదండ్రుల జ్ఞాప కార్థం రిషికపూర్ ఆ పేరు పెట్టుకున్నాడు. రిషి తల్లి కృష్ణ ప్రస్తుతం చెంబూర్‌లో వుంటున్నారు. పెళ్ళ యిన తరువాత పూర్తిగా పిల్లల ఆలనాపాలనలో వుండిపోయింది నీతూ. పిల్లలతో గడపడానికి ఒక ప్పుడు రిషికపూర్‌కి టైం వుండేది కాదు. ఇప్పుడు రిషికపూర్‌కి తీరికుంది, పిల్లలే బిజీగా వున్నారు.